# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 289 | పేజీలు: 4 | వెల: రూ.4/- | సోమవారం 15 జూన్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# విద్యార్థులకు మఫత్‌లాల్ యూనిఫాం

## ఈ ఏడాది విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి పంపిణీ



- గురుకులాల విద్యార్థులకు కిట్ల అందజేత...
- కిట్‌లో బెల్టు, టై, స్కూల్ బ్యాగ్, బూట్లు... బెడ్డింగ్ సామగ్రి
- ఇప్పటికే పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు...
- యూనిఫాం కుట్టు పనిలో నిమగ్నమైన
- మహిళా స్వయం సంఘాల సభ్యులు
- తొలిసారిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు
- బ్యాగు, బెల్టు, టై, బూట్లు, సాక్సులు
- విద్యా రంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ

**హైదరాబాద్, జూన్ 14 (నమస్తే ఉదయం)**

ప్రైవేటు..కార్పొరేట్ స్కూల్ విద్యార్థులు ధరించే మన్నికైన యూనిఫాంలు.. వారికి ఏమాత్రం తీసిపోని విధంగా బ్రాండెడ్ షూ.. సాక్సులు.. టై, బెల్టులు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందనున్నాయి.. నాణ్యమైన వస్త్రం సరఫరా అయితేనే యూనిఫాంలు ఎక్కువ రోజులు మన్నుతాయి. అందుకే విద్యార్థులకు అందజేసే యూనిఫాంలకు సంబంధించి వస్త్రం సరఫరా మొదలు కుట్టు పని వరకు ప్రతి దశలోనూ నాణ్యతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని రకాల పాఠశాలలు, గురుకులాల్లోని విద్యార్థులకు మఫత్‌లాల్ వంటి పేరెన్నికల గల సంస్థ నుంచి యూనిఫాం వస్త్రాన్ని ఈ దఫా సేకరిస్తున్నారు. యూనిఫాంతో పాటు స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్సులు, టై, బెల్ట్, బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా ఇలా ప్రతి దానిలోనూ ప్రభుత్వం నాణ్యతకు పెద్ద పీట వేసింది. గతంలో పాఠశాల విద్యా విభాగం, ఏ గురుకుల విభాగానికి ఆ గురుకుల విభాగం విద్యార్థులకు అవసరమయ్యే సామగ్రి వేర్వేరుగా కొనుగోలు చేసి అందజేసేవి.. దాంతో అనేకరకాల హెచ్చుతగ్గులు కనిపించేవి. కొన్ని పొరపాట్లు చోటుచేసుకునేవి.. ఆ సమస్యలను అధిగమించి సామగ్రి సేకరణ.. పంపిణీలో ఏకరూపత కోసం ఈ ఏడాది ప్రభుత్వం సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ సిస్టమ్ తీసుకువచ్చింది. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పరిధి విద్యా సంస్థల విద్యార్థులకు మన్నికైన యూనిఫాం, ఇతర సామగ్రి అందజేసేందుకు రూ.687.78 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. దీనిని ఖర్చుగా కాకుండా భవిష్యత్ తరాలపై పెట్టే వ్యయంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నాయి..

- ★ మొత్తం 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంకు సంబంధించి 2.97 కోట్ల మీటర్ల వస్త్రం కొనుగోలుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.
  మఫత్‌లాల్ కంపెనీ 2.41 కోట్ల మీటర్లు, తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ (TGSCO) 55.32 లక్షల మీటర్ల వస్త్రం సరఫరా చేస్తున్నాయి. ఇందులో విద్యార్థినీవిద్యార్థులకు లైట్ బ్లూ, డార్క్ బ్లూ, వైట్, ప్లెయిన్ మెరూన్, మెరూన్ చెక్స్ రంగుల్లో యూనిఫాంలు అందజేయనున్నారు. విద్యార్థినులకు స్కర్ట్, పంజాబీ డ్రెస్, చున్నీ సరఫరా చేయనున్నారు. ఈ దఫా విద్యార్థులకు యూనిఫాం రంగులను ప్రభుత్వం మార్చింది. డేస్కాలర్స్‌కు టాప్ లైట్ బ్లూ, లోవర్స్ డార్క్ బ్లూ యూనిఫాంలో ఉండనున్నాయి. గురుకులాల్లోని విద్యార్థులకు టాప్‌లో మెరూన్ చెక్, లోవర్ మెరూన్ యూనిఫాంలో ఉండనున్నాయి.
- ★ యూనిఫాం కుట్టు పనిని మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం

...మిగతా 2లో





# హై అలర్ట్

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 14 (నమస్తే ఉదయం)**

వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల దగ్గర పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్వహణ మాన్యువల్ ప్రకారం జరగాలని, ప్రాజెక్ట్ ల సీఈలు , ఎస్.ఈలు ఈ సీజన్‌లో స్థానికంగా ఉండాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇంజినీర్లు ప్రాజెక్ట్‌లు వదిలి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎం.సీ.ఆర్.హెచ్.ఆర్డీ బోధీ పెవిలియన్ లో వర్షాలు, ప్రకృతి విపత్తులపైన

..మిగతా 2లో

## కేంద్రం ఇచ్చిన నిధులపై సీఎం రేవంత్ చర్చకు రావాలి

### రామచందర్ రావు

**హైదరాబాద్, జూన్ 14 (నమస్తే ఉదయం)**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కుటుంబమే బాగుపడిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. అంబర్‌పేటలో నిర్వహించిన భాజపా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

“జీహెచ్ఎంసీ మూడు కార్పొరేషన్లు అయింది. 3 కార్పొరేషన్లలో భాజపా గెలిస్తే అభివృద్ధి జరుగుతుంది. కాంగ్రెస్ సర్కార్ పంట కొనుగోలు చేయకపోతే ఒత్తిడి తీసుకొచ్చాం. పండిన పంటలో కేంద్ర ప్రభుత్వం సగం కంటే ఎక్కువే కొనుగోలు చేసింది. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై



సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలి. సీఎం వస్తే సచివాలయం ఎదురుగా గణాంకాలతో వివరిస్తా. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి భాజపాను ఓడించాలని చూస్తున్నాయి” అని రామచందర్‌రావు అన్నారు.



# ప్రపంచానికి సరికొత్త దిశను చూపుతున్న భారత్

- ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించే స్థాయికి భారత్ ఎదిగింది : మోదీ
- ఆవిష్కరణ అనేది భారతదేశ డీఎన్ఏలోనే ఉంది-
- భారత్ సుస్థిర భవిష్యత్తు, సమస్త ప్రపంచం కోసం ఆవిష్కరిస్తుంది
- ఫ్రాన్స్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'భారత్ ఇన్నోవేట్స్' సదస్సులో ప్రధాని మోదీ-
- ఆవిష్కరణలకు నిలయంగా భారత్‌ను అభివర్ణించిన మెక్రాన్

**న్యూఢిల్లీ, జూన్ 14 (నమస్తే ఉదయం)**

భారత్ కేవలం తన సుస్థిర భవిష్యత్తు కోసమే కాకుండా ప్రపంచం కోసం సరికొత్త ఆవిష్కరణలు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇతరులు కనుగొన్న పరిష్కారాలను వాడుకునే దేశంగా మాత్రమే భారత్ మిగిలిపోలేదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించే స్థాయికి ఎదిగిందని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'భారత్ ఇన్నోవేట్స్' సదస్సులో ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉన్న బంధాన్ని, సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రధాని మోదీ కొనియాడారు. "ఆవిష్కరణ అనేది భారతదేశ డీఎన్ఏలోనే ఉంది. వేల సంవత్సరాలుగా భారత్ తన జ్ఞానం, నూతన ఆవిష్కరణల ద్వారా ప్రపంచానికి సరికొత్త దిశను చూపిస్తూ వస్తోంది. గణితం నుంచి ఖగోళ శాస్త్రం వరకు, వైద్యం నుంచి యోగా

...మిగతా 2లో

# రాజ్యసభలో 2/3 మెజారిటీ దిశగా ఎన్‌డీఏ

## మరి లోక్‌సభ మాటేమిటి?

### ఎన్‌డీఏ రాజ్యసభలో 2/3 మెజారిటీ సాధిస్తుందా? ఎంత వరకు ఛాన్స్ ఉంది?



**న్యూఢిల్లీ, జూన్ 14 (నమస్తే ఉదయం)**

బంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో మొదలైన తిరుగుబాటు, కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ కూటమికి పార్లమెంట్‌లో కలిసిరానుంది. కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించుకోవడానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధన దిశగా ఎన్‌డీఏ అడుగులు వేస్తోంది. తాజాగా జరిగిన రాజ్యసభ ఎన్నికలు, టీఎంసీ ఎంపీల రాజీనామాలతో ఎగువ సభలో ఎన్‌డీఏ బలం పెరిగి మూడింట రెండొంతుల మెజార్టీకి చేరువైంది. లోక్‌సభలో మాత్రం ఆ మ్యాజిక్ ఫిగర్‌కు ఎన్‌డీఏ కూటమి ఇంకా దూరంలోనే ఉంది. పార్లమెంటు ఉభయ సభల్లోనూ మూడింట రెండొంతుల మెజారిటీని సాధించేందుకు ప్రయత్నిస్తున్న ఎన్‌డీఏకు, టీఎంసీలో తలెత్తిన అంతర్గత తిరుగుబాటు బలాన్ని చేకూర్చే అవకాశం ఉంది. రాజ్యసభలో ప్రస్తుతం ఎన్‌డీఏ బలం 148 కాగా, ఝార్ఖండ్, మిజోరాంలో స్వతంత్ర స్థానాల ఎన్నికల

...మిగతా 2లో

# దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేయండి

## సీఎం రేవంత్‌కు రఘునందన్ రావు సవాల్



**హైదరాబాద్, జూన్ 14 (నమస్తే ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మెదక్ ఎంపీ, బీజేపీ నేత ఎం. రఘునందన్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర పాలనను సమర్థంగా నిర్వహించడంలో సీఎం విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. అలాగే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మెదక్‌లో మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే

...మిగతా 2లో

# మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

## బావిలో పడ్డ వ్యాను.. 8 మంది మృతి!

### అదుపుతప్పి బావిలో పడ్డ పికప్ ట్రక్కు



**సోలాపూర్, జూన్ 14 (నమస్తే ఉదయం)**

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడింది. ఈ ప్రమాదంలో 8 మంది మరణించారని సమాచారం. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గురైన

..మిగతా 2లో



# ప్రపంచానికి సరికొత్త దిశను చూపుతున్న భారత్

మొదటి పేజీ తరువాయి

వరకు భారత్ అందించిన సహకారం, సమస్త మానవాళి ప్రగతికి మూలాధారంగా నిలిచింది. నేడు మనం అదే వారసత్వానికి సరికొత్త వేగాన్ని, సరికొత్త దిశను అందించాం. మీ( భారత యువత) సామర్థ్యాన్ని చూస్తూ నేను ఒకటే చెప్పగలను. భారత్ భారీ స్థాయిలో, అత్యంత వేగంతో ఆవిష్కరిస్తుంది. భారత్ సుస్థిర భవిష్యత్తు, సమస్త ప్రపంచం కోసం ఆవిష్కరిస్తుంది."

–నరేంద్ర మోదీ, భారత ప్రధాన మంత్రి

భారత్‌కు చెందిన యువ ఆవిష్కర్తలు కేవలం స్థానిక సమస్యలకే కాకుండా, సమస్త మానవాళికి ప్రయోజనం చేకూర్చే సరికొత్త సాంకేతిక పరిష్కారాలను కనుగొంటున్నారని మోదీ ప్రశంసించారు. అలాగే, భారత్, ఫ్రాన్స్ మధ్య సంబంధాల గురించి మోదీ ప్రస్తావించారు. ఇరుదేశాల మధ్య ఉన్నది సాధారణ బంధం కాదని, అదొక ప్రత్యేక భాగస్వామ్యమని పేర్కొన్నారు. ఈ బంధానికి అనుసంధానం, దృఢ సంకల్పం, ఆవిష్కరణ, స్ఫూర్తి, ఉమ్మడి దృక్పథం ఐదు ముఖ్యమైన స్తంభాలని వివరించారు.

ఆవిష్కరణలకు నిలయంగా భారత్

భారత్ ఆవిష్కరణలకు నిలయమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), వాతావరణ మార్పుల వంటి కీలక రంగాల్లో రెండు దేశాల మధ్య భాగస్వామ్యం ఉందని ఆయన పేర్కొన్నారు. తాము మేక్–ఇన్–ఇండియా కార్యక్రమాన్ని గౌరవిస్తున్నామని, వివిధ రంగాల్లో ఫ్రాన్స్ ఇందులో భాగస్వామిగా ఉందని మెక్రాన్ తెలిపారు. పౌర అణు శక్తి రంగంలో, ముఖ్యంగా 'స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల' విషయంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇక, 'భారత్ ఇన్నోవేట్స్ 2026' అనేది భారత ప్రభుత్వం చేపట్టిన ఒక కీలక కార్యక్రమం. ప్రపంచ వేదికపై దేశంలోని డీప్–టెక్ స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థల వృద్ధిని వేగవంతం చేయడం దీని లక్ష్యం. ఈ కార్యక్రమం భారత్, ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలకు చెందిన ప్రముఖ ఆవిష్కరణల స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు పాల్గొన్నాయి. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో ఉన్న మోదీ, అక్కడ మెక్రాన్‌తో చర్చలు జరపడంతో పాటు G–7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు.

మోదీని ఆలింగనం చేసుకున్న మెక్రాన్

ఇదిలా ఉండగా, ప్రధాని మోదీకి ఆదివారం ఫ్రాన్స్‌లోని నైస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఘన స్వాగతం పలికారు. ఇద్దరు నేతలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, కరచాలనం చేసుకున్నారు. అనంతరం, 'భారత్ ఇన్నోవేట్స్'ను ఇద్దరూ సంయుక్తంగా ప్రారంభించారు. జూన్ 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఆవిష్కరణల సదస్సు, భారతీయ ఆవిష్కర్తలను ప్రపంచ పెట్టుబడిదారులు, పారిశ్రామిక నాయకులు విద్యాసంస్థలతో అనుసంధానించడానికి ఒక శక్తివంతమైన వేదికగా ఉపయోగపడుతుంది. ఇక, ఈ ఇన్నోవేషన్ కార్యక్రమంతో భారత్–ఫ్రాన్స్ సంబంధాలు బలపడనున్నాయి. రక్షణ, అంతరిక్షం, డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వివిధ రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారం మరింత బలపడనుంది.

# దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేయండి

మొదటి పేజీ తరువాయి

పరిమితమైందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. రాష్ట్ర శాసనసభను రద్దు చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలని సూచించారు. అసెంబ్లీ రద్దు చేస్తే తెలంగాణలో గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎంపీలు రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, కేవలం అసెంబ్లీని రద్దు చేసి ప్రజల తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. ప్రజల మద్దతు తమకే ఉందని బీజేపీ నమ్మకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా రఘునందన్ రావు ప్రస్తావించారు. కల్లాల్లో ధాన్యం నిల్వ ఉండిపోవడం, బ్యాంకుల్లో నగదు కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి నుంచి తగిన స్పందన కనిపించడం లేదని విమర్శించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్లే రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థ నడుస్తోందని వ్యాఖ్యానించారు. మాటలకే పరిమితం కాకుండా తన సవాల్‌ను స్వీకరించాలని సీఎం రేవంత్ రెడ్డిని రఘునందన్ రావు కోరారు.

# అమెరికా ఆదేశాలను మోడీ పాటిస్తున్నారు

## ప్రధానిపై రాహుల్ గాంధీ ఫైర్..

న్యూఢిల్లీ, జూన్ 14 (నమస్తే ఉదయం)



ఒమన్ తీర ప్రాంతంలో అమెరికా జరిపిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతిచెందిన ఘటన దేశంలో రాజకీయంగా తీవ్ర దుమారం రేగుతోంది. ఈ దాడులపై విచారం వ్యక్తం చేయక పోగా, భారత్‌ను ఉద్దేశించి అమెరికా హెచ్చరికలు జారీ చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ ఒక విధేయుడైన సేవకుడిలా అమెరికా ఆదేశాలను పాటిస్తున్నారంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

మరోవైపు, ఒమన్ తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న ఓ చమురు ట్యాంకర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన భారతీయ నావికుడు నిశాంత్ ఉర్తనాథన్ మృతదేహాన్ని, వెంటనే స్వదేశానికి తీసుకురావాలని రాహుల్ డిమాండ్ చేశారు. అతడి మృతదేహం కుళ్లిపోయేస్థితికి వచ్చిందని, MT సెలెస్టియల్ భారత కెప్టెన్ చెప్పినట్లు పేర్కొన్న ఒక పోస్ట్‌ను రాహుల్ ట్యాగ్ చేశారు. ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో నిలిచి ఉన్న ఒక నౌకలో వైద్యపరమైన సమస్యల కారణంగా అతడు మరణించినట్లు మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం పేర్కొంది. అతని పార్థివ దేహం ప్రస్తుతం దుక్మ్ పోర్టులోని నౌకలోనే ఉందని, త్వరగా భారతదేశానికి తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపింది. నౌకా యాజమాన్య సంస్థతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, సంబంధిత భాగస్వాములందరితో సమన్వయం చేస్తున్నామని చెప్పింది.

### మోదీపై తీవ్ర విమర్శలు చేసిన ఖర్గే

మరోవైపు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారతీయ నావికులు చనిపోయి మూడు రోజులు గడిచినా, ప్రధాని మోదీ ఎందుకు స్పందించడం లేదన్నారు. "నావికుల మృతిపై కనీసం ఒక సంతాప సందేశం గానీ, బహిరంగ ప్రకటన గానీ రాలేదు. దేశాన్ని తలవంచనివ్వనని మీరు(మోదీ) అన్నారు, కానీ దేశ ప్రతిష్టను, సార్వభౌమాధికారాన్ని మీరు ఎంతగా దిగజార్చారో చెప్పడానికి ఇప్పుడు ప్రత్యేక సాక్ష్యాలు అవసరం లేదు. జాతీయ ప్రయోజనాలు కేంద్రం రోజువారీగా తాకట్టు పెడుతోంది. 'విశ్వగురు' అనే ప్రచారంతో నిజాలను కప్పిపుచ్చుతోంది. ప్రశ్నలకు సమాధానాలు లేని ఈ సమయంలో, మౌనం అనేది బాధ్యతాయుతమైన సమాధానం కాబోదు. దేశానికి స్పష్టత అవసరం. అలాగే మృతుల కుటుంబాలకు న్యాయం జరగాలి" అని ఖర్గే పేర్కొన్నారు. అలాగే, అగ్రరాజ్యం జరిపిన దాడిలో ముగ్గురు భారతీయులు మరణించడంపై విచారం వ్యక్తం చేశారు. ఇక, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నడుమ ఏప్రిల్ 13న హర్మ్యాజ్ జలసంధిపై అమెరికా నౌకా దిగ్బంధనాన్ని విధించింది. ఫలితంగా, ఇస్లామిక్ రిపబ్లికన్ ఓడరేవులకు నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. అయితే ఇటీవల, ఒమన్ తీరంలో భారత సిబ్బందితో ఉన్న మూడు నౌకలపై దాడి జరిగింది. వాటిలో ఒక దాడిలో బుధవారం ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. ఈ నేపథ్యంలో భారత నావికుల మరణంపై విదేశాంగ మంత్రి జైశంకర్, మార్కో రూబియోకు ఫోన్ చేసి నిరసన వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు మఫత్‌లాల్ యూనిఫాం

మొదటి పేజీ తరువాయి

అప్పజెపింది.. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు రోజుకు 75 వేల నుంచి లక్ష యూనిఫాంలు కుట్టే సామర్థ్య ఉంది. ఒక్కో యూనిఫాం కుట్టు పనికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 చెల్లిస్తుంది. సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫాంలు అందించనున్నారు. ఈ పనితో సంఘాల్లోని మహిళలకు సుమారు రూ.40 కోట్లకుపైగా ఆదాయం సమకూరనుంది.

★ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఇందులో యూనిఫాంతో పాటు తెల్లని బూట్లు, తెల్లని సాక్సులు ఉంటాయి. గతంలో బీసీ గురుకులాల్లోని విద్యార్థులకు మాత్రమే బూట్లు ఇచ్చేవారు. ఈ దఫా అన్ని రకాల యాజమాన్యాల్లోని విద్యార్థు లకు బూట్ లను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పట్టణ గురుకుల పాఠశాలల విద్యార్థులకు బెల్టు, ఐడీ కార్డు, టై, స్కూల్ బ్యాగు, బూట్లు (నలుపు, తెలుపు – సాక్సులతో), బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా, ట్రంక్ బాక్సు, పీటీ డ్రెస్, నైట్ డ్రెస్, ట్రాక్ సూట్ తో కూడిన సంపూర్ణమైన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. మైనారిటీ గురుకులాల్లోని విద్యార్థులకు తొలిసారిగా ట్రాక్ సూట్, నైట్ డ్రెస్ లను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లోని విద్యార్థులకు తొలిసారిగా నల్లటి బూట్లు, బెల్టును రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది.

★ ఇప్పటి వరకు ప్రభుత్వాలు పాఠశాలలకే పెద్దపీట వేశాయి. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థుల పైనా ప్రత్యేకంగా దృష్టిసారించింది. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూలేని విధంగా తొలిసారి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోని సుమారు 2 లక్షల మంది విద్యార్థులకు కాలేజీ బ్యాగు, బెల్టు, టై, నల్లటి బూట్లు, సాక్సులు అందజేయనుంది.



★ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లోని విద్యార్థులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇప్పటికే ఆయా సంస్థలకు చేరాయి. తొలి వారంలోనే వాటి పంపిణీ పూర్తి కానుంది.

★ విద్యార్థులకు యూనిఫాంతో పాటు అందజేసే బూట్లు, సాక్సులు, టైలు, బెల్టులు, గురకుల్లాలోని విద్యార్థులకు అందజేసే దుప్పట్లు, ప్లేట్లు, గ్లాస్‌లు ప్రతి ఒక్కటి నాణ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ టెండర్లను పిలిచింది. మిగిలిన ఆర్డర్లను TGSCO, TGLIPC, తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్–TGTPCలకు రాష్ట్ర ప్రభు త్వం అప్పజెప్పింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేస్తున్నది రూ.687.78 కోట్లు మాత్రమే. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శ కంగా జాతీయ ఈ టెండర్ల పద్ధతిని పాటిస్తోంది. ఈ విషయంలో ప్రతిపక్ష నేతలు, దురుద్దేశ్యపూరితంగా రూ.వేల కోట్ల అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉంది.

★ యూనిఫాం, బెడ్డింగ్ ఆర్డర్లలో 25–30% తెలంగా ణ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘానికి (TGSCO)కి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందులో 25% యూనిఫాం వస్త్రం (సుమారు 56 లక్షల మీటర్లు), 100% దుప్పట్లు (6,49,381), 3 లక్షల బెడ్‌షీట్లు, 2.29 లక్షల కార్పెట్లు ఉన్నాయి. ఈ ఆర్డర్‌తో చేనేత కార్మికులకు ఆదాయం సమకూరనుంది.

★ టైలు, బెల్టులు, ఐడీ కార్డుల ఆర్డర్‌ను తెలంగాణ లెద ర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ (TGLIPC)కి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ ఆర్డర్‌తో ఆ సంస్థ ఆర్థికంగా బలోపేతం కానుంది.

★ ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే యూనిఫాం, టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, కార్పెట్లతో యూనిఫాంలు కుట్టే మహిళలు, దుప్పట్లు, కార్పెట్లు తయారుచేసే చేనేత కార్మికులు, బెల్టులు, ఇతర సామగ్రి తయారీతో TGLIPC పరిధిలోని కార్మికులకు ఆదాయం లభిస్తుంది.

★ గత ప్రభుత్వం హయాంలో పాఠశాల విద్యా శాఖతో పాటు ఏ గురుకుల సంస్థకు ఆ గురుకుల సంస్థ యూనిఫాంతో పాటు ఇతర సామగ్రి తయారీ సేకరణ, పంపిణీ చేపట్టేవి. ఇందులో ఏకరూపత లేకపోవడంతో అనేక అవకతవకలు చోటు చేసుకునేవి. ఈ వస్తువుల సరఫరాలో పాతుకుపోయిన కొన్ని ముఠాలు నాసిరకమైన వస్త్రం, ఇతర సామగ్రి పంపిణీ చేసి భారీగా దండుకునేవి. పైగా ఆ నాసిరకం సామగ్రి పంపిణీ ఏడాదిపొడవునా సాగేది. ఆ అవకతవలన్నింటికి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది తొలిసారిగా సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. దీంతో అన్ని రకాల యాజమాన్యాల్లోని విద్యార్థులకు ఏకకాలంలో యూనిఫాంలు, కిట్లు, ఇతర సామగ్రి అందనున్నాయి.

# రాజ్యసభలో 2/3 మెజారిటీ దిశగా ఎన్‌డీఏ

మొదటి పేజీ తరువాయి

ద్వారా మరో మూడు సీట్లు కూటమి ఖాతాలో పడనున్నాయి. దీనికి తోడు, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు రాజ్యసభ ఎంపీలు రాజీనామా చేయడంతో, బంగాల్ ఉపఎన్నికల తర్వాత ఆ మూడు స్థానాలను కూడా ఎన్‌డీఏ గెలుచుకోనుంది. దీంతో ఎగువ సభలో ఎన్‌డీఏ బలం 154కి చేరనుంది. రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించాలంటే 163 స్థానాలు ఉండాలి. దీనికి ఎన్‌డీఏ కూటమి కేవలం 9 స్థానాల దూరంలో ఉంటుంది. రానున్న రోజుల్లో మరికొందరు టీఎంసీ ఎంపీలు (సుమారు 20 మంది) రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈ కారణంగా ఎన్‌డీఏ సులభంగానే 163 మార్కును దాటి, కీలక బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సాధించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో ఉత్తరప్రదేశ్ నుంచి 10 మంది రాజ్యసభ ఎంపీలు పదవీ విరమణ చేయనున్నారు. గత యూపీ అసెంబ్లీలో సమాజ్‌వాదీ పార్టీకి బలం పెరగడం వల్ల అక్కడ కొన్ని స్థానాలను ఎన్‌డీఏ కోల్పోయే ప్రమాదం ఉంది. మరోవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి బలం క్రమంగా క్షీణిస్తోంది. డీఎంకేకు చెందిన 8 మంది, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ ఎంపీలు కూటమికి దూరం కావడంతో ప్రస్తుతం 'ఇండియా' కూటమి బలం రాజ్యసభలో 64కి పడిపోయింది. వైఎస్సార్ కాంగ్రెస్‌కు 7 సీట్లు ఉండగా, బిజూ జనతా దళ్‌కు 6 సీట్లు ఉన్నాయి. ఎండీఎంకే వంటి స్వతంత్ర పార్టీలు బిల్లుల ఆధారంగా ఎటువైపు అయినా మొగ్గు చూపే అవకాశం ఉంది.

### లోక్‌సభలో మెజారిటీ కష్టమే!

లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించాలంటే 363 మంది ఎంపీల మద్దతు అవసరం ఉంటుంది. తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయిన దాదాపు 20 మంది ఎంపీలు ప్రత్యేక వర్గంగా ఏర్పడి ఎన్‌డీఏకు మద్దతు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. వీరంతా సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి, తాము టీఎంసీ నుంచి విడిపోతున్నట్లు అధికారిక లేఖను అందజేయనున్నారు. ఈ తిరుగుబాటు ఎంపీల మద్దతుతో లోక్‌సభలో ఎన్‌డీఏ బలం 313కి చేరనుంది. అయినప్పటికీ, లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి అవసరమైన 363 మార్కును చేరుకోవడానికి ఎన్‌డీఏ దూరంలో ఉంటుంది.

### ఆ బిల్లులు పాసవ్వాలంటే?

వచ్చే వర్షాకాల సమావేశాల్లో అత్యంత కీలకమైన బిల్లులను తీసుకురావడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కానీ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడానికి ప్రత్యేక మెజారిటీ అవసరం. దీని ప్రకారం, సభలో మొత్తం సభ్యుల్లో కనీసం సగం మంది హాజరు కావాలి. హాజరై ఓటు వేసిన వారిలో మూడింట రెండు వంతుల మెజారిటీ లభిస్తేనే సదరు బిల్లు ఆమోదం పొందుతుంది. ఏప్రిల్‌లో జరిగిన ఓటింగ్ సమయంలో 528 మంది ఎంపీలు హాజరయ్యారు. దీనివల్ల 2/3 మెజారిటీకి అవసరమైన సంఖ్య 352గా నిర్ణయించడమైంది. అయితే ఈ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు రావడంతో, 54 ఓట్ల తేడాతో బిల్లు వీగిపోయింది. ఒకవేళ బీజేపీ కనుక 2/3 మెజారిటీ సాధించగలిగితే చాలా సులువుగా తను అనుకున్న బిల్లును ఆమోదించగలుగుతుంది. మరి ఏం కానుందో చూడాలి.



# హై అలర్ట్

మొదటి పేజీ తరువాయి

ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, డీజీపీ సి.వి. ఆనంద్, ఇరిగేషన్, మెట్రో వాటర్ బోర్డు, ఆర్.డబ్ల్యూ.ఎస్ కార్యదర్శులు, కమీషనర్లు, ముఖ్య అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల మెయింటెన్స్,గేట్ల మరమ్మతులకు నిధులను తక్షణమే నిధులు విడుదల చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షం సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు రోడ్ల పైన ఉండాల్సిందే అని అవసరం అయితే తాను కూడా రోడ్ల పైకి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్ అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇరిగేషన్,మెట్రో వాటర్ బోర్డు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు సమన్వయంతో పని చేయాలి అని సూచించారు.

విద్యుత్‌శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి : జూన్ 1న జరిగిన సమీక్షలో వర్షాలపై తాను ముందస్తు సూచనలు ఇచ్చానని, జూన్ 9న భారీ వర్షం పడినప్పటికీ ఆ సమయంలో అధికారులు సరిగా పని చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షం సమయంలో క్యూర్ ఏరియాలో మునిసిపల్, పోలీస్, అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందన్నారు. వర్షం వచ్చినప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్స్, బ్లాక్ స్పాట్స్, ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాల డేటా ఆధారంగా పని చేయాలి అని సూచించారు. విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలి అని స్పష్టం చేశారు.

ఫీల్డ్‌లో ఉండని అధికారులపై కఠిన చర్యలు : ఫీల్డ్‌లో ఉండని అధికారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని, వర్షం సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు రోడ్ల పైన ఉండాల్సిందే అని అన్నారు. అవసరం అయితే తాను కూడా రోడ్ పైకి వస్తానన్నారు. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్ అయితే కఠిన చర్యలు తప్పవన్నారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు వస్తే సహించేది లేదన్నారు. ట్రాఫిక్ డిపార్ట్మెంట్ లో తక్షణమే ఖాళీ లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రైతు వేదికలను యూరియా పంపిణీ కోసం ఉపయోగించు కోవాలి అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రైతు వేదికలో యూరియా పంపిణీ బాధ్యతను స్థానిక అగ్రికల్చర్ అధికారికి అప్పగించాలన్నారు. యూరియా పంపిణీ లో రెవిన్యూ సిబ్బందిని భాగస్వామ్యం చేయాలని స్పష్టం చేశారు.

# మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

భక్తులు పంధర్‌పుర్ తాలూకాలోని రంజని గ్రామానికి చెందినవారిగా సమాచారం. వీరంతా మస్వాద్‌లోని ఆలయాన్ని సందర్శించి తిరిగి వస్తుండగా తండుల్‌వాడి సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

ప్రాథమిక సమాచారం ప్రకారం, డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ప్రమాద సమయంలో వాహనంలో 15 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

### దుర్ఘటనపై స్పందించిన మహారాష్ట్ర సీఎం

మరోవైపు, ఈ దుర్ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాన్ని అత్యంత విషాదకరంగా అభివర్ణించారు. మరణించిన వారికి తన హృదయపూర్వక నివాళులు అర్పించారు. ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, అలాగే, ఒక్కొక్కరికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు.

కాగా, ఈ ప్రమాదం నుంచి ఏడుగురిని రక్షించామని, వారు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని ఫడణవీస్ తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సోలాపూర్ జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారని చెప్పారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక యంత్రాంగంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన పేర్కొన్నారు.

### బావి చుట్టూ ఎలాంటి రక్షక గోడలేదు!



ఇదిలా ఉండగా, మస్వాద్ నుంచి పంధర్‌పుర్ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఒక బావి ఉందని, ఆ బావికి చుట్టూ ఎలాంటి రక్షణ గోడ లేదని స్థానికులు చెబుతున్నారు. కాగా, మృతుల పేర్లను అధికారులు వెల్లడించారు. ఇందుబాయి దశరథ్ భావు(60), పూజా అమోల్ సటోర్(23), సమర్థ బాలాజీ బావ్చే(27), అశ్విని సందీప్ బావ్చే(27), సంస్కర్ సందీప్ బావాచే(14), సంస్కృతి సందీప్ బావ్చే(14), పూజా బాలాజీ బావచే(ఆరు నెలలు), ఆరవ్ అశోక్ సతోరే(ఎనిమిదేళ్లు)గా అధికారులు గుర్తించారు.

### ఈ ప్రమాదం అత్యంత బాధాకరమైనది : ఎమ్మెల్యే రోహిత్

మరోవైపు, ఈ ఘటనపై ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ప్రమాదం అత్యంత బాధాకరమైనదని, హృదయ విదారకమైనదని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ప్రమాదానికి గల కారణాలను కనుగొనడంతో పాటు, సహాయక చర్యల్లో ప్రభుత్వం తక్షణమే సహాయపడాలని ఆయన పేర్కొన్నారు.

### రైలు ఢీకొన్న ఘటనలో మరో నలుగురు మృతి

మధ్యప్రదేశ్‌లోని మొరెనాలో ఖజురహో– ఉదయ్‌పుర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగాయన్న వదంతులు నలుగురి ప్రాణాలను బలిగొన్నాయి. రైలులో మంటలు చెలరేగాయన్న వదంతులతో భయపడిన కొందరు ప్రయాణికులు ఎమర్జెన్సీ చైన్ లాగారు. కిందికి దిగి, పక్క ట్రాక్ పై ఉండగా వేగంగా దూసుకొచ్చిన మరో రైలు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, హేతంపుర్–ధోల్‌పుర్ రైల్వే సెక్షన్‌లో రైలు ప్రయాణిస్తుండగా జనరల్ బోగీలో ఓ ప్రయాణికుడి మొబైల్ ఫోన్ వేడెక్కి పొగలు వచ్చాయి. ఈ క్రమంలో రైలులో మంటలు అంటుకున్నాయని వదంతులు వ్యాపించాయి. తీవ్ర భయాందోళనకు గురైన కొందరు ప్రయాణికులు అకస్మాత్తుగా చైన్ లాగి పక్కనే ఉన్న ట్రాక్‌పైకి పరుగులు తీశారు. అదే సమయంలో ఆగ్రా వైపు నుంచి వేగంగా వస్తున్న ఫిరోజ్‌పుర్– సియోనీ పాతాళకోట్ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మహిళలు, ఒక నాలుగేళ్ల బాలుడు సహా మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే ఉన్నతాధికారులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ , జీఆర్‌పీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రైలు దుర్ఘటనకు దారితీసిన పరిస్థితులపై రైల్వే శాఖ ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది.

# కిస్మత్‌పూర్‌లో ఘనంగా జరిగిన "మన్నె శ్రీ భజన కీర్తనలు.. 2 పుస్తకావిష్కరణ కార్యక్రమం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్, జూన్ 14 (నమస్తే ఉదయం) :**

నంది పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత మన్నె మహాత్మరావు (మన్నెశ్రీ) రచించిన "మన్నె శ్రీ భజన కీర్తనలు -- 2" పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం కిస్మత్‌పూర్ హనుమాన్ దేవాలయంలో భక్తి, సాహిత్య వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నిర్వహించిన భజన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. అనంతరం జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సాహిత్యాభిమానులు, ప్రముఖులు, మన్నెశ్రీ అభిమానులు పాల్గొని రచయితను అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తి సాహిత్యం సమాజంలో ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. మన్నెశ్రీ రచనలు మరింత మంది పాఠకులకు చేరేలా కృషి చేస్తానని, ఈ గ్రంథాన్ని గూగుల్ వేదికల ద్వారా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మన్నెశ్రీ భజన కీర్తనలు తెలుగు భక్తి సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయని, ఈ గ్రంథం భజన బృందాలు, యువత మరియు భక్తి మార్గంలో నడిచే ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రచురణకర్త నీరుడు శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ, మన్నెశ్రీ రచించిన భజన కీర్తనలు భక్తి భావాన్ని ప్రజల్లో మరింత పెంపొందించడమే కాకుండా తెలుగు సాహిత్యానికి విశిష్టమైన సేవగా నిలుస్తాయని అన్నారు. భజన సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఈ గ్రంథాన్ని ప్రచురించడం జరిగిందని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాన్ని తన తండ్రి స్వర్గీయ నీరుడు విఠలయ్య స్మారకార్థంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. వారి ఆధ్యాత్మిక భావాలు, భక్తి సంప్రదాయాల పట్ల ఉన్న అంకితభావానికి గుర్తుగా ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భక్తి సాహిత్యాన్ని ప్రోత్సహించడం ద్వారా వారి ఆశయాలను కొనసాగించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మన్నెశ్రీ రచనలు భక్తి, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను ప్రజలకు చేరవేస్తూ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని కొనియాడారు. భక్తి సాహిత్యాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇటువంటి గ్రంథాలు మన సంస్కృతి సంపదను భావితరాలకు అందించే వారధిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, భజన బృందాల సభ్యులు, సామాజిక ప్రముఖులు, భక్తులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగింపులో రచయిత శ్రీ మన్నెశ్రీ ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు, సాహిత్యాభిమానులకు, ముఖ్య అతిథులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ నీరుడు శేఖర్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. భక్తి, సాహిత్యం, సంస్కృతికి అంకితమైన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తూ ఒక విశిష్ట వేడుకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.అమరేందర్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి శ్రీనివాస్ నాయి, బీజేపీ రాష్ట్ర నాయకుడు వై. శ్రీధర్, విద్యార్థి సంఘం నాయకుడు వేముల రామకృష్ణ, బాలరాజ్ యాదవ్, పుస్తకాల నర్సింగ్ రావు, కన్నగారి నర్సింహ రెడ్డి, సతీష్ కుమార్, సరస్వతి శిశు మందిర్ అధ్యక్షులు అర్జున్ గౌడ్, మాధవ రెడ్డి, శ్రీరాములు, ఎమ్మార్వో కృష్ణ, కిస్మత్ పూర్ మాజీ సర్పంచ్ శ్రీశైలం ముదిరాజ్, ఎల్. సంజీవ రెడ్డి, స్థానిక బండ్లగూడ జాగిర్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు మహాలింగం, దామోదర్ రెడ్డి, పవన్ సాయి, కిరణ్, గిరి, లక్ష్మణ్, సాయి యాదవ్, వెంకటేశ్, తదితర నాయకులు, పెద్దలు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.



మన్నె శ్రీ భజన కీర్తనలు -2 ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రచయిత మన్నె మహాత్మా రావు, నీరుడు శేఖర్ ముదిరాజ్ తదితరులు



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# ఐఐఆర్ఎఫ్ ర్యాకింగ్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వర్శిటీకి 19వ స్థానం

**బుద్వేల్, జూన్ 14 (నమస్తే ఉదయం)**

ద ఇండియన్ ఇనిస్టిట్యూషనల్ ర్యాకింగ్ ఫ్రేంవర్క్ (ఐఐఆర్ఎఫ్) నిర్వహించిన అధ్యయనం లో రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 19వ స్థానం లో నిలిచిందని వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. దేశంలోని ఐదు వేల అకామిక్ ఇనిస్టిట్యూషన్స్ లలో నిర్వహించిన వివిధ రకాల సర్వే ప్రకారం జయశంకర్ వ్యవసాయ వర్శిటీ కి 19వ ర్యాంకు రావడం సంతోషకరమన్నారు. తాను వైస్ చాన్సలర్గా బాధ్యతలు చేపట్టిన సమయంలో వర్శిటీ 37వ ర్యాంకు లో ఉందని, ఆ తర్వాత వర్శిటీ లో అనేక సంస్కరణలు చేపట్టి విద్యా, పరిశోధన, విస్తరణ రంగాలలో చేసిన మెరుగైన సేవలను బట్టి 24వ ర్యాంకు కు చేరుకుందన్నారు. ప్రస్తుతం ఐఐఆర్ఎఫ్ ప్రకటించిన ర్యాంకులలో 19వ స్థానానికి చేరుకుందని, రాబోయే రోజులలో 10వ ర్యాంకు లోపు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నిలబెట్టడమే తన ధ్యేయం అన్నారు. 19వ ర్యాంకు రావడానికి విద్యార్థులు, ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారుల సమిష్టి కృషి చేయడమేనన్నారు.



# ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, జూన్ 14 ( నమస్తే ఉదయం):**

పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం ముత్తంగి పరిధిలోని బతుకమ్మ ఘాట్ వద్ద లావణ్య పద్మావతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాల ద్వారా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సలహాలు, అవసరమైన మందులు ఉచితంగా అందడం వల్ల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, భవిష్యత్తులో కూడా మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మేరాజ్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, సందీప్, సురేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయ నిధి ఆపదలో ఉన్న కుటుంబాలకు అండ

### కాటా శ్రీనివాస్ గౌడ్

### 13 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన కాట

**పటాన్ చెరు, జూన్ 14 (నమస్తే ఉదయం):**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందుల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 6,64,500/- విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అనారోగ్యం, ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి గొప్ప భరోసాను కల్పిస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.



# భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు పొందాలి

### భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు నర్రగిరి,పర్వతాలు

**రాజేంద్రనగర్,జూన్14(నమస్తే ఉదయం)**

భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు గుర్తింపు కార్డులను తప్పకుండా పొందాలని,తద్వారా ప్రభుత్వం అందించే సదుపాయాలను అందిపుచ్చుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు.ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులను మంజూరు చేయించారు.ఆ గుర్తింపు కార్డులను శంషాబాద్ లేబర్ అడ్డా దగ్గర ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు,భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నర్రగిరి చేతుల మీదుగా కార్మికులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.యాదగిరి,ఏఐటీయూసీ మండల కార్యదర్శి గిలకరాజు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.ఈ వారు మాట్లాడుతూ..లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు కల్పించే వరకు ఏఐటీయూసీ,భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.కార్మికులకు రూ.ఐదులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని లేబర్ అడ్డాల దగ్గర అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.గుర్తింపు కార్డులు పొందని ఇతర కార్మికులందరూ వెంటనే నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.గుర్తింపు కార్డుల మంజూరు కోసం ప్రయత్నం చేసిన నర్రగిరి,గిలకరాజును అభినందించారు.

# ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీకి మధుబన్ కాలనీ గుండ రోడ్డు ఇవ్వం

### మధుబన్ కాలనీ అసోసియేషన్

### మాది హుడా అనుమతి లేఅవుట్: కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

**రాజేంద్రనగర్,జూన్14(నమస్తే ఉదయం)**

జిహెచ్ఎంసి అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని మధుబన్ కాలనీ గుండా ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీకి వెళ్లడానికి రోడ్డును వేయడాన్ని మధుబన్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం అడ్డుకున్నారు. అక్రమంగా తమ కాలనీలోకి ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు అప్రోచ్ రోడ్డును వేస్తున్నటాన్ని అడ్డుకుంటూ హెచ్ఎండిఏ అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేశామని మధుబన్ కాలనీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.అందులో భాగంగా కాలనీవాసులు ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీకి వెళ్లడానికి అక్రమంగా రోడ్డును ఏర్పాటు చేయడాన్ని అడ్డుకున్నారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ..మధుబన్ కాలనీ హెచ్ఎండిఏ లేఅవుట్ అని,ఈ కాలనీకి గేటెడ్ కమ్యూనిటీ లాగా పూర్తిగా ఎవరు అక్రమంగా రోడ్లు ఏర్పాటు చేయటానికి నిబంధనల ప్రకారం అనుమతి లేదన్నారు.అయితే అనుమతి లేని ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు అక్రమంగా మధుబన్ కాలనీ గుండా రోడ్డు ఏర్పాటు చేయటంతో భారీ వాహనాలు ప్రవేశిస్తూ ప్రమాదాలు చోటుచేసుకోవడానికి అవకాశం ఉందన్నారు.దీన్ని తాము పూర్తిగా అడ్డుకుంటున్నామని పేర్కొన్నారు.తమ కాలనీ గుండా రోడ్డు అక్రమంగా ఏర్పాటు చేయటం విషయంపై హెచ్ఎండిఏ అధికారులకు సమాచారం ఇచ్చామని అన్నారు.వ్రాతపూర్వకంగా అధికారులు వినతిపత్రం ఇచ్చి ఈ దారిని రాకుండా ప్రహరీగోడ ఏర్పాటు చేసుకోవాలని,అధికారులు సూచించారని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.







# తాపీ మేస్త్రిల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం






### భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు..
### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, జూన్ 14 (నమస్తే ఉదయం)**

పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రిల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం అమీన్పూర్ డివిజన్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల ట్రేడ్ యూనియన్ మరియు తాపీ మేస్త్రి యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. సమస్యల పరిష్కారానికి సామర్థ్యంతో ముందుకు వెళుతూ సమన్వయంతో పని చేసుకోవాలని సూచించారు. అతి త్వరలో తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికుల కోసం స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటి సుధాకర్ రెడ్డి, అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సంఘం అధ్యక్షులు నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

# చెరువును తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం

### సిసి రోడ్డు ఎత్తుగా వేయడం వల్లే నిలిచిన వర్షపు నీరు!
### అధికారుల నిర్లక్ష్యమా? కాంట్రాక్టర్ అవగాహన లోపమా?

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14(నమస్తే ఉదయం):**

శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు కేటిదొడ్డి మండలం గంగన్ పల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం మొత్తం నీట మునిగి, ఒక చిన్నపాటి చెరువును తలపిస్తోంది. స్కూల్ ముందు భాగంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎత్తుగా వేయడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని తెలుస్తోంది. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో, నీరంతా పాఠశాల మైదానంలోనే నిలిచిపోయింది. ఇది అధికారుల నిర్లక్ష్యమా, లేక కాంట్రాక్టర్ యొక్క అవగాహన లోపమా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రాంగణమంతా నీరు నిలిచిపోవడంతో సోమవారం పాఠశాలకు వచ్చే చిన్నారి విద్యార్థులు, ఉపాధ్యాయులు లోపలికి వెళ్లడానికి కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడింది. నిలిచిన నీటి వల్ల దోమలు చేరి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు, మండల అధికారులు తక్షణమే స్పందించి, పాఠశాల ప్రాంగణంలో నిలిచిన నీటిని తొలగించి, భవిష్యత్తులో నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గంగన్పల్లి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# మాదాపూర్‌లో డ్రగ్స్ పార్టీ బస్ట్..

## రూ.43.30 లక్షల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం

**శేరిలింగంపల్లి : జూన్ 14, (నమస్తే ఉదయం)**

మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రనాయక్ తండాలో ఉన్న ఎంబీఎస్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న డ్రగ్స్ పార్టీపై కూకట్‌పల్లి ఎస్‌వోటీ బృందం మెరుపుదాడి నిర్వహించి 9 మందిని అదుపులోకి తీసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ పార్టీ సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి. శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఎంబీఎస్ అపార్ట్‌మెంట్‌లోని 606వ గదిలో తనిఖీలు చేపట్టిన ఎస్‌వోటీ పోలీసులు, ఎండీఎంఏ, ఓజీ కుష్ గంజాయి వినియోగిస్తున్న యువకులను గుర్తించారు. దాడిలో ప్రధాన నిందితుడు, డ్రగ్స్ పెడ్లర్‌గా వ్యవహరిస్తున్న దనేకుల తరుణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు డ్రగ్స్ సరఫరాదారులు కార్తీక్, పృథ్వి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ కేసులో మొత్తం 9 మంది యువకులను పట్టుకున్న పోలీసులు, వారి వద్ద నుంచి భారీగా మాదకద్రవ్యాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.



పోలీసు అరెస్టు చేసిన డ్రగ్స్ పార్టీలో పాల్గొన్న యువకులు

**స్వాధీనం చేసుకున్న వస్తువులు**

లక్ష 80 వివలువ చేసే 15 గ్రాముల ఎండీఎంఏ, 40 లక్షల విలువ చేసి 300 గ్రాముల ఓజీ కుష్ గంజాయి, 9 మొబైల్ ఫోన్లు, 2 డిజిటల్ వెయింగ్ మెషీన్లు, 5 మోజో ఓసీడీ ప్యాకెట్లు, 50 ఖాళీ పౌచ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.43.30 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. నిందితులను స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి దర్యాప్తు కోసం మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## మోదీని విమర్శించే నెపంతో ప్రజల విజయాలను రాహుల్ తక్కువ చేసి మాట్లాడుతున్నారు: నిర్మల సీతారామన్

**హైదరాబాద్, జూన్ 14 (నమస్తే ఉదయం)**

ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించే క్రమంలో రాహుల్ గాంధీ, దేశ ప్రజలు సాధించిన విజయాలను తక్కువ చేసి మాట్లాడుతున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలో ఎలాంటి సంక్షోభం లేకపోయినా, రాహుల్ గాంధీ ఊహాజనిత భయాలను సృష్టిస్తున్నారని ఆమె మండిపడ్డారు. లోక్‌సభలో మాట్లాడిన ప్రతిసారీ దేశంలో అన్ని వ్యవస్థలూ కుప్పకూలిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తుంటారని విమర్శించారు. కరోనా, పశ్చిమాసియా సంక్షోభం వంటి సవాళ్లు ఎదురైనా భారత్ అద్భుతమైన ప్రగతిని సాధించిందని నిర్మలా తెలిపారు. అయినా రాహుల్ గాంధీ ఉద్దేశపూర్వకంగా వాటిని విస్మరిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం బెంగళూరులో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సమావేశంలో పాల్గొన్న ఆమె రాహుల్‌పై తీవ్ర విమర్శలు చేశారు.



**సవాళ్లు ఉన్నాయ్!**

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన సరఫరాకు ఆటంకాలు, అవి ప్రపంచ వాణిజ్యపై చూపే ప్రభావాన్ని నిర్మలా సీతారామన్ వివరిస్తూ, ఈ సవాళ్లు కేవలం ముడిచమురు, ఎల్‌పీజీ ధరల హెచ్చుతగ్గులకే పరిమితం కాలేదని అన్నారు. "ఈ సవాళ్లు ముడి చమురు, ఎల్‌పీజీ ధరలపైనే కాకుండా అంతర్జాతీయ షిప్పింగ్ (రవాణా)పై కూడా ప్రభావం చూపుతాయి. యుద్ధ వాతావరణం ఉన్న ప్రాంతాల గుండా ఓడలను పంపడానికి షిప్పింగ్ కంపెనీలు వెనుకాడతాయి. ఓడలపై దాడులు జరిగే ప్రమాదం ఉన్నందున ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెరుగుతాయి. సరకు రవాణా చేసే ఓడ ఖాళీగా ఉన్నా, ముడి చమురుతో ఉన్నా బీమా ఖర్చులు మాత్రం గణనీయంగా పెరగడం ఖాయం. అయినప్పటికీ దేశానికి ఇంధన సరఫరా నిరంతరం అందేలా చూడడం కోసం చివరికి ఆ ఖర్చులన్నింటినీ భరించాల్సి ఉంటుంది.



# మోగనున్న బడిగంటలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14(నమస్తే ఉదయం)**

గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. సోమవారం నుంచి మళ్లీ బడిగంట మోగనుంది. ఏప్రిల్ 23వరకు 2025-26విద్యా సంవత్సరం కొనసాగింది. ఏప్రిల్ 24 నుంచి దాదాపుగా 50రోజుల పాటు పాఠశాలలకు వేసవి సెలవులు కొనసాగాయి. ఎట్టకేలకు సోమవారం పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో హెచ్‌ఎంలు ముందురోజు ఏర్పాట్లు చేపట్టారు.

**పండుగ వాతావరణంలో ..**

వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలల్లో బడిగంట మోగనుంది. 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను పండుగ వాతావరణంలో తెరవాలని అధికారులు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని కలిగించేలా తోరణాలు కట్టి ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. జూన్ 1 నుంచి జయశంకర్ బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటా తమ పాఠశాలల ప్రత్యేకతను తెలుపుతూ కరపత్రాలు, బ్యానర్లతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

**కనీస వసతులు నిల్**

ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు కనీస వసతులు లేవు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద కోట్లాది రూపాయలు ఖర్చు చేసి.. అదనపు గదులు, టాయిలెట్స్, తాగునీరు, డైనింగ్ హాల్స్, వంట గదుల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం కల్పన తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. అయితే నెలలు గడుస్తున్నా, చాలా పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు. దాంతో విద్యార్థులు ఆరు బయటే పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పనులు చేపట్టేందుకు కార్మికులు లేకపోవడంతో.. గ్రామ పంచాయతీ, మునిసిపల్ కార్మికుల ద్వారానే శుభ్రం చేయిస్తున్నారు. కొన్నిచోట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులే పాఠశాలలను శుభ్రం చేసుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది.

# చికిత్స పొందుతూ మహిళ మృతి

**మల్దకల్ జూన్ 14 (జనంసాక్షి)**

జోగులంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలం ఉలిగేపల్లి గ్రామానికి చెందిన బోయ పద్మమ్మ (44) అనే మహిళ అనారోగ్యంతో మూడు రోజుల క్రితం పెట్రోల్ తాగి ఆత్మహత్య చేసుకుంది. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారుఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# శివరాంపల్లి ప్రజా పొదుపు సంఘం వ్యవస్థాపకులు కొత్త శ్రీరామ్ రెడ్డి మృతి

### శ్రీరామ్ రెడ్డి అంత్యక్రియలకు హాజరైన యువనేత కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్, జూన్ 14(నమస్తే ఉదయం)**

జిహెచ్ఎం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి ప్రజా పొదుపు సంఘం వ్యవస్థాపకులు, గ్రామ పెద్దలు కొత్త శ్రీరామ్ రెడ్డి వృద్ధాప్యం, అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కొత్త శ్రీరామ్ రెడ్డి 1982 సంవత్సరంలో పొదుపు సంఘం ఏర్పాటు చేయించారు. శివరాంపల్లి గ్రామంలో ప్రజలు ఆర్థిక పురభివృద్ధి సాధించాలని లక్ష్యంతో పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేశారు. శివరాంపల్లి స్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. శ్రీరామ్ రెడ్డి మరణ వార్త తెలుసుకున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి, పలువురు ఆయన పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించారు.



# మల్లాపురం తండాలో పిడుగుపాటుకు బర్రె మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14(నమస్తే ఉదయం)**

కేటిదొడ్డి మండలంలోని మల్లాపురం తండాలో ఆదివారం ఉదయం పిడుగుపాటుకు ముడావత్ పంపా నాయక్ కు చెందిన పాడి బర్రె మృత్యువాత పడింది. బర్రె మృతితో సుమారు రూ.70,000 నష్టపోయామని, తమని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు. కాగా నైరుతి రుతుపవానల ప్రభావంతో జోగుళాంబ గద్వాల జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సమాచారం తెలుసుకున్న పశు వైద్యాధికారి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధిత రైతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ పాండు నాయక్, గ్రామస్తులు కోరారు.




Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733